ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక




పద్మవ్యూహంలో చిక్కుకున్న

## అభిమన్యుడిలా దేశం పరిస్థితి

బడ్జెట్‌పై రాహుల్ గాంధీ ప్రసంగం..

సభలో దుమారం

2లో..


సంపుటి: 2 | సంచిక: 110 | పేజీలు: 4 | వెల: రూ.3/- | మంగళవారం 30 జులై 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


# పవర్ వార్

- విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాట్లలో అవినీతి
- విద్యుత్ విచారణ కమిషన్ ఏర్పాటుతో ముచ్చెమటలు
- కమిషన్ రద్దు చేయాలని కెసిఆర్ ఎందుకు కోర్టుకు వెళ్లారు?
- విద్యుత్ సివిల్ పనులన్నీ అనుయాయులకు కేటాయింపు
- అసెంబ్లీలో గత ప్రభుత్వ విధానాలపై రేవంత్ విమర్శలు



హైదరాబాద్, జులై 29 (ప్రభాత ఉదయం): విద్యుత్ కొనుగోళ్లు, ప్లాంట్ల ఏర్పాటు తదితర విషయాల్లో అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. గత ప్రభుత్వ అక్రమాలను వెల్లడిస్తూ సిఎం రేవంత్ ఘాటు విమర్శలు చేశారు. అలాగే విద్యుత్ కమిషన్ విసయంలో ఛైర్మన్‌ను మార్చాలని సుప్రీం సూచించిందే తప్ప.. విచారణను ఆపమనలేదని అన్నారు. విచారణ ఆపాలని కోర్టుకు వెళ్లిన కెసిఆర్..ఎందుకు విచారణను అడ్డుకుంటున్నట్లో చెప్పాలన్నారు. ప్రశోత్తారాలపై చర్చను సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రద్దు చేశారు. ఆర్థిక నిర్వహణ , ఆర్థిక ప్రణాళిక, విద్యుత్ డిమాండ్స్‌పై చర్చ చేపసట్టారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ ఒప్పందాల విషయంలో సత్యహరిశ్చంద్రుడి తరువాత కేసీఆరే అన్నట్లు వాళ్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఛత్తీస్ ఘడ్, యాదాద్రి, భద్రాద్రి ఒప్పందాలపై వారే విచారణకు అడిగారని, వాళ్ల కోరిక మేరకే విచారణకు కమిషన్ నియమించామన్నారు.. కమిషన్ వద్దకు వచ్చి వివరాలు ఇవ్వాలని కోరితే కమిషన్‌పైనే

..మిగతా 2లో

తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్‌లో

## భారీ కుంభకోణం

జిఎస్టీ చెల్లింపుల్లో అక్రమాల గుర్తింపు

మాజీ సిఎస్ సోమేశ్ కుమార్‌పై కేసు నమోదు



హైదరాబాద్, జులై 29 (ప్రభాత ఉదయం): తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్‌లో భారీ కుంభకోణం జరిగిందని గుర్తించిన అధికారులు కేసు నమోదు చేసారు. కమర్షియల్ ట్యాక్స్ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ చెల్లింపులో అక్రమాలు జరిగాయని గుర్తించిన అధికారులు కేసు నమోదుచేశారు. ఈ కుంభకోణంలో మాజీ సీఎస్ సోమేష్‌కుమార్‌తో పాటు పలువురు కీలక పాత్ర పోషించారని కేసులు నమోదు చేశారు. ఈ కుంభకోణంలో వందకోట్ల వరకు అక్రమాలు జరిగినట్టు భావిస్తున్నారు. దాదాపు 75 కంపెనీలు ఇందులో భాగమై ఉన్నట్టు తేల్చారు. సాఫ్ట్‌వేర్ లో మార్పులు చేసి కుంభకోణానికి పాల్పడినట్టు ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలింది. ఇందులో తెలంగాణల బేవరేజెస్ కార్పొరేషన్ కూడా ఉందని సమాచారం. ఇందతా అప్పట్లో సీఎస్‌గా ఉన్న సోమేష్‌కుమార్ సూచనలతోనే ట్యాక్స్ పేమెంట్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు ఇతర చర్యలు తీసుకున్నారని అధికారులు గుర్తించారు. అందుకే ఈ కేసులో

..మిగతా 2లో

లోక్‌సభలో బిజెపి విప్‌గా చేవెళ్ల ఎం.పి

## కొండా విశ్వేశ్వర్ రెడ్డి



న్యూఢిల్లీ, జూలై29 (ప్రభాత ఉదయం): చేవెళ్ల ఎం.పి. కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి లోక్ సభలో అరుదైన గౌరవం దక్కింది. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి లోక్ సభ లో విప్ గా బాధ్యత నిర్వహించే అవకాశం వచ్చింది. ఈ మేరకు భారతీయ జనతా పార్టీ కేంద్ర కార్యాలయం నుండి లోక్ సభ స్పీకర్ కు పార్టీ తరుపున చీఫ్ విప్ , విప్ లుగా నియమించిన వారి పేర్లను తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం నుండి లోక్ సభ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి ఆ అవకాశం రావడం హర్షణీయం.

## పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో 2న సీఎం సమావేశం.. ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

హైదరాబాద్, జులై 29 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో ఇటీవల పదోన్నతి పొందిన 30వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 2న సమావేశం కానున్నారు. ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న సమావేశం ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం సంబంధిత ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ జితేందర్, ఆయాశాఖల కార్యదర్శులు శ్రీధర్, బుర్ర వెంకటేశం, హరిచందన, హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు తదితరులు హాజరయ్యారు. ఈ

..మిగతా 2లో





## దళితుల సమస్యల పరిష్కారానికి కృషి

కేసీఆర్ హయాంలో దళితులకు పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల చిన్నచూపు..

దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఆదుకోవాలి..

మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం,జూలై 29(ప్రభాత ఉదయం) దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఎమ్మార్పీఎస్ టీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహా సోమవారం ఆమెను కలిసి వివిధ సమస్యలపై చర్చించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దళితులకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి రూ.10లక్షలను ఆర్థిక సాయం చేసినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల చిన్నచూపు చూస్తుందని పేర్కొన్నారు.దళితులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటూ ప్రభుత్వంపై సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లెల్ల కృష్ణారెడ్డి,ఊటు యాదయ్య,తదితరులు పాల్గొన్నారు.

## పొలాలకు మీటర్లు పెట్టాలని చెప్పలేదు

ఇందుకోసం 30వేల కోట్లు వదులుకున్నాం

విద్యుత్ స్థాపక శక్తిని పెంచిన ఘనత మాదే

నిజగానే కెసిఆర్ సత్యహరిశ్చంద్రుడే

అసెంబ్లీలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సమర్థన

విద్యుత్ రంగాన్ని అప్పుల్లోకి నెట్టారన్న రాజగోపాల్ రెడ్డి




హైదరాబాద్, జులై 29 (ప్రభాత ఉదయం): రైతుల పొలాల్లో విరీటర్లు పెట్టడానికి కేసీఆర్ ఒప్పుకోలేదని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం ఇచ్చే రూ.30 వేల కోట్లను కూడా వదులుకున్నట్లు తెలిపారు. విద్యుత్ విరీటర్లపై సీఎం ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. మోదీ, కేసీఆర్, ఉదయ్ స్కీమ్ గురించే మాట్లాడుకున్నారని చెప్పారు. 2014కి ముందు మాత్రమే కరెంటు ల్కెన్ల కింద ఇళ్ల నిర్మాణం జరిగింది. భారాస ప్రభుత్వంలో కరెంటు ల్కెన్ల కింద ఇళ్ల నిర్మాణం జరగలేదు. పదేళ్ల భారాస పాలనలో స్థాపిత విద్యుత్ సామర్థ్యం

..మిగతా 2లో

ఢిల్లీ కోచింగ్ సెంటర్ ఘటన..

## దర్యాప్తునకు 'హోంశాఖ' కమిటీ




న్యూఢిల్లీ, జులై 29 (ప్రభాత ఉదయం): కోచింగ్ సెంటర్ ఘటనపై విచారణకు కేంద్ర హోం మంతిత్వశాఖ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటైంది. ఈ ఘటనకు దారితీసిన కారణాలు, దీనికి బాధ్యులెవరు? వంటి అంశాలను ఈ కమిటీ గుర్తించనుంది. భవిష్యత్తులో ఇలాంటి తరహా ఘటనలు చోటుచేసుకోకుండా చేపట్టాల్సిన విధానపర మార్పులనూ సూచించనుంది. 30 రోజుల్లోగా పూర్తిస్థాయి నివేదిక అందించనుంది. దిల్లీలోని స్టడీ సర్కిల్‌లోని బేస్‌మెంట్‌లోకి అకస్మాత్తుగా వరద నీరు ప్రవహించడంతో ముగ్గురు సివిల్స్ విద్యార్థులు తాన్యా సోని, శ్రేయా యాదవ్, నవిన్ డెల్విన్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. కోచింగ్ సెంటర్ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉన్న విషయాన్ని స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు.



లిక్కర్ స్కామ్ కేసులో

## కేజ్రీవాల్‌పై సీబీఐ ఛార్జ్‌షీట్

న్యూఢిల్లీ, జులై 29 (ప్రభాత ఉదయం): ఢిల్లీ లిక్కర్ కేసులో సీబీఐ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు పలువురి పేర్లను ఛార్జ్ షీట్‌లో చేర్చింది. ఇంతకు ముందే సీబీఐ ఒక ప్రధాన ఛార్జ్ షీట్ తో పాటు నాలుగు అనుబంధ అభియోగ పత్రాలను దాఖలు చేసింది. అయితే సోమవారం తాము దాఖలు చేసిన ఛార్జ్ షీట్.. ఢిల్లీ లిక్కర్ కేసులో చివరిదని వెల్లడించింది. గత చార్జ్ షీట్లలో సీఎం కేజ్రీవాల్‌తో పాటు ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిలపై సీబీఐ పలు అభియెగాలను మోపింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మార్పులు చేయడం ద్వారా మద్యం వ్యాపారులు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వ పెద్దలకు లబ్ధి చేకూరిందని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. ఈ కేసులో ఎంపీ కేజ్రీవాల్ ఆగస్టు 8వ తేదీ వరకు

..మిగతా 2లో

# పవర్ వార్



మొదటి పేజీ తరువాయి...

ఆరోపణలు చేశారని విమర్శించారు. విచారణ కమిషన్ ముందు వాదన వినిపించకుండా కమిషన్ రద్దుచేయాలని కోర్టుకు వెళ్లారని, విచారణ కొనసాగించాల్సిందేనని సుప్రీంకోర్టు చెప్పిందని, అయితే కొత్త కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలని న్యాయస్థానం చెప్పిందని సీఎంరేవంత్ రెడ్డి తెలిపారు. విచారణ కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను సోమవారం సాయంత్రంలోగా నియమిస్తామన్నారు. తెలంగాణకు వాళ్లే ఏదో కొత్త వెలుగులు తెచ్చినట్లు మాట్లాడుతున్నారని.. వైఎస్ హయాంలో తీసుకున్న నిర్ణయాలతోనే హైదరాబాద్ నగరానికి నిరంతర విద్యుత్ సరఫరా జరిగిందని, ఏ ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తే ఆ ఆస్తులు సంబంధిత ఆస్తులు ఆ రాష్ట్రానికే చెందుతాయని చట్టం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. కానీ ఉత్పత్తి ప్రాతిపదికన కాకుండా, వినియోగ ప్రాతిపదికన విభజన జరగాలని ఆనాడు జైపాల్ రెడ్డి కేంద్రాన్ని ఒప్పించారన్నారు. రాజ్యాంగంలో లేని ప్రత్యేక మినహాయింపు తెలంగాణకు ఇప్పించారని, 53.46 శాతం తెలంగాణకు, 46.54 శాతం ఏపీకి విద్యుత్ పంపిణీ చేసేలా జైపాల్ రెడ్డి తీవ్రంగా కృషి చేశారని, తెలంగాణ రాష్ట్రాన్ని చీకట్లు కమ్మకుండా చేశారని కొనియాడారు. నాడు కేసీఆర్ ఎలా సభను తప్పుదోవ పట్టించారో 2015 రికార్డులు తీయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆనాడు తాను సభలో మాట్లాడితే సభ నుంచి మార్షల్స్‌తో బయటకు పంపించారన్నారు. సోలార్ ప్రాజెక్ట్ గురించి గొప్పగా చెబుతున్నారు... అవి ప్రైవేటు కంపెనీలు ఉత్పత్తి చేస్తున్నాయని, వాళ్ల పాలనలో సోలార్ పవర్ కేవలం ఒక మెగావాట్ మాత్రమేనని అన్నారు. పవర్ ప్లాంట్స్‌కు సంబంధించి ఎలక్ట్రో మెకానికల్ వర్క్, సివిల్ వర్క్ కాంట్రాక్టు విషయంలో వాళ్ల తెలివి ప్రదర్శించారని, గంపగుత్తగా బీహెచ్ఈఎల్‌కు కాంట్రాక్టు అప్పగించారన్నారు. బీహెచ్ఈఎల్ నుంచి సివిల్ వర్క్స్ మొత్తం వాళ్ల బినామీలు, బంధువులు, అనుయాయులకు ఇచ్చారని ఆరోపించారు. అందులో వేలకోట్ల అవినీతి జరిగిందని సీఎం విమర్శించారు. విచారణలో అంతా బయటపడుతుందనే ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారన్నారు. 400 మెగావాట్ల విద్యుత్ ప్లాంటుకు టెండర్ వేస్తే సూపర్ క్రిటికల్ టెండర్ పిలిస్తే కొరియన్, బీహెచ్ఈఎల్, మరో కంపెనీ పాల్గొన్నాయని.. అక్కడ 18 శాతం లెస్‌కు బీహెచ్ఈఎల్ పనులు దక్కించుకుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇక్కడ కూడా 18 శాతం లెస్‌కు పనులు చేసే అవకాశం ఉన్నా.. ప్రాజెక్టును నామినేషన్‌పై బీహెచ్ఈఎల్‌కు అప్పగించారన్నారు. అందులో దాదాపు రూ. 8 వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టు విషయంలో సబ్ క్రిటికల్ టెక్నాలజీతో గుజరాత్‌లోని ఇండియా బుల్స్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారని, సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించాలని చట్టంలో ఉన్నా ఉల్లంఘించారని విమర్శించారు. ఇండియా బుల్స్ నుంచి రూ. వెయ్యి కోట్లు మెక్కి కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించారని, భద్రాద్రి పవర్ ప్రాజెక్ట్ కట్టాల్సిన చోట కట్టలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. వాళ్ల నిర్వాకంతో 16 మంది అధికారులు విచారణ ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రెండేళ్లలో పూర్తి కావాల్సిన పనులు ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న పరిస్థితి నెలకొందని, వారి కోరిక మేరకే విచారణ కమిషన్ ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దొరికిపోయామని అర్థమైంది కాబట్టే కమిషన్‌పై ఆరోపణలు చేశారన్నారు. కావాలన్నది వాళ్లేనని.. సెగ తగలగానే వద్దన్నది వాళ్లేనని పేర్కొన్నారు. తిన్నింటి వాసాలు లెక్కబెట్టే లక్షణాలు తమకు లేవని.. వీరి వాదన ఏంటో కమిషన్ ముందు చెప్పాలన్నారు. ఈరోజు సాయంత్రానికల్లా విచారణ కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను నియమిస్తామని సీఎం రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. విద్యుత్ అంశంలో న్యాయ విచారణ కోరిందే భారాస సభ్యులు అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'జగదీశ్‌రెడ్డి ఆవేదన చూస్తుంటే చర్లపల్లి జైలులో ఉన్నట్లు మాట్లాడుతున్నారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు, యాదాద్రి పవర్ఎ÷%-%లాంట్‌పై న్యాయ విచారణ జరుగుతోంది. విచారణ కమిషన్ ముందు వాదనలు వినిపిస్తే భారాస సభ్యుల నిజాయతీ బయటకు వస్తుంది. న్యాయ విచారణ కోరింది వాళ్లే.. వద్దంటున్నది వాళ్లే. విద్యుత్ కమిషన్ ఎదుట కేసీఆర్ ఎందుకు హాజరు కాలేదని అన్నారు.



## డయల్ 100కు స్పందించి యువకుడిని కాపాడిన కేటిదొడ్డి పోలీసులు

గద్వాల(కేటిదొడ్డి), జూలై 29(ప్రభాత ఉదయం)డయల్%-%100కు వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించి ఓ యువకుడి ప్రాణాలను కాపాడిన కేటిదొడ్డి పోలీసులను మండల ప్రజలు అభినందించారు. కేటిదొడ్డి ఎస్ఐ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం కేట్టిదొడ్డి మండలం మల్లాపురం తండాకు చెందిన గంగు నాయక్ కుమారుడు విజయ్ నాయక్ చెడు వ్యసనాలకు అలావాటు కావడంతో ఇంట్లో తల్లిదండ్రులకు తెలిసింది. ఆదివారం రాత్రి ఆ యువకుడిని తల్లిదండ్రులు మందలించడంతో కోపంతో తాను ఆత్మహత్య కు చేసుకుంటానని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు డయల్ 100 నంబర్ కు డయల్ చేశారు. కేటిదొడ్డి శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ రంజిత్ కుమార్, హోంగార్డు శ్రీనివాస్ లు ఆ యువకుడి కోసం వెతికసాగారు. సోమవారం ఆ యువకుడిని కుచినెర్ల గ్రామ శివారులో ఉన్నట్లు గుర్తించారు. ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. డయల్ 100 కాల్‌కు స్పందించి ఆ యువకుడిని కాపాడిన కేటిదొడ్డి పోలీసులను అభినందించారు.



### తెలంగాణ సంస్కృతీ సాంప్రదాయాలకు
## ప్రతీక బోనాల పండుగ

**అనీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా కట్ట మైసమ్మ తల్లి ఫలహారం బండి ఊరేగింపు..**

కూకట్‌పల్లి, జూలై 29 (ప్రభాత ఉదయం) తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల మహోత్సవం శ్రీ సాయి క్రికెట్ క్లబ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయినగర్, బాలానగర్ లో ఘనంగా ప్రారంభమైంది. ఆషాడ మాసం చివరి వారంలో శ్రీ కట్ట మైసమ్మకు బోనాలు దాసరి కుటుంబ సభ్యులకు, భక్తులు అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా దాసరి అనీష్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఫలహారం బండి ఊరేగింపు ను ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ధూప, దీప నైవేద్యముల మధ్య అమ్మవారికి బొట్టు, బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు సూపర్లను ఆకట్టుకున్నాయి. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకటసేన రెడ్డి, చంద్రప్రకాష్ రెడ్డి, ఇంద్రసేన రెడ్డి, భరత్ రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, అఖిల్ రెడ్డి, గౌతమ్ రెడ్డి, దాండు సాయి కిరణ్ మిత్రబృందం పాల్గొన్నారు.



## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

**కూకట్ పల్లి కాంగ్రెస్ ఇన్చార్జి బండి రమేష్**

కూకట్‌పల్లి, జూలై 29 (ప్రభాత ఉదయం): ఆషాడ మాసం బోనాల ఉత్సవాలు సంబరాలు కొనసాగు తున్నాయి. మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ లో సోమవారం బండి రమేష్ ఇతర బస్తి నాయకుల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహంతో పాటు పలహారం బండిని ఊరేగించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు వివిధ దేవుళ్ళ వేషధారణలు డీజే సౌండ్స్, మిరు మిట్లు గొలిపే విద్యుత్ దీపాలు, డప్పుల మోతలతో అమ్మవారి జయజయ ధ్వనులతో బస్తీలు మోతమోగాయి ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ మరియు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కర్క వేణుగోపాల్ ముఖ్య అతిధులుగా హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి అనంతరం పలహారం బండిని ప్రారంభించారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో, తివారి, లక్ష్మణ్ రాజు ముదిరాజ్, డిజైన్ అధ్యక్షులు రమేష్, మాధురి రాము, వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు లక్షన్నర లోపు రుణమాఫీ

**కాంగ్రెస్ కిసాన్ సెల్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి**



కొత్త కోట,జూలై29(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరోగ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని కాంగ్రెస్ కిసాన్ సెల్ వనపర్తి జిల్లా కమిటీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే తొలి విడతగా రూ లక్ష వరకు ప్రభుత్వం మాఫీ చేసింది ప్రస్తుతం మంగళవారం రెండో విడత రుణమాఫీకి రైతుల అకౌంట్లో సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఆవరణలో ఉదయం 11 గంటలకు రూ 1.50 వరకు . జమ చేయనున్నారు. వనపర్తి కలెక్టర్ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో ప్రకటన జరుగుతుందని రైతులు పాల్గొనాలని ఆయన కోరారు. ఈనెల 18న మొదటి విడతలో 11.50 లక్షల మంది రైతులకు 6000 వేల 92 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగింది. రెండో విడతలు ఆరు లక్షల మంది రైతులు అకౌంట్లో రుణమాఫీ జమ కానున్నవి. మిగతావి ఆగస్టు 15 వరకు 2 లక్షల మాఫీ చేశారన్నారు.

### లిక్కర్ స్కామ్ కేసులో
## కేజ్రీవాల్‌పై సీబీఐ ఛార్జ్‌షీట్

మొదటి పేజీ తరువాయి...

జ్యుడీషియల్ కస్టడీలో ఉండనున్నారు. సీబీఐ గతంలో చేసిన అభియోగాల ప్రకారం, ఏపీకి చెందిన మాగుంట శ్రీనివాసులు రెడ్డి 2021 మార్చి 16 వ తేదీన ఢిల్లీ సెక్రటేరియట్‌లో సీఎం కేజ్రీవాల్‌తో భేటీ అయ్యారు. 2021-2022 ఢిల్లీ ఎక్సైజ్ పాలసీలో మార్పులు చేసి మద్యం వ్యాపారంలో తమకు మద్దత ఇవ్వాలని కోరారు. అందుకు అంగీకరించిన కేజ్రీవాల్ అప్పటికే ఈ విషయంలో తమతో కలిసి పనిచేసున్న కల్వకుంట్ల కవితను కలవాలని సూచించారు. తాము చేస్తున్న సాయానికి ప్రతిగా ఆమ్ ఆద్మీ పార్టీకి నిధులు ఇవ్వాలని కేజ్రీవాల్ కోరారు. కవిత సహా పలువురు మద్యం వ్యాపారులతో కూడిన సౌత్ గ్రూప్ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీకి, ఢిల్లీ ప్రభుత్వంలోని పలువురు పెద్దలకు రూ. 90 కోట్ల నుంచి రూ. 100 కోట్ల వరకు నిధులు అందాయని సీబీఐ ఆరోపించింది.

### పద్మవ్యూహంలో చిక్కుకున్న
## అభిమన్యుడిలా దేశం పరిస్థితి

**బడ్జెట్‌పై రాహుల్ గాంధీ ప్రసంగం.. సభలో దుమారం**

న్యూఢిల్లీ, జులై 29 (ప్రభాత ఉదయం): లోక్‌సభ బడ్జెట్ సమావేశాలు వాడీవేడీగా కొనసాగుతున్నాయి. బడ్జెట్‌పై ప్రసంగం వేళ విపక్షనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలతో తీవ్ర దుమారం చెలరేగింది. ఇద్దరు ప్రముఖ పారిశ్రామికవేత్తలు దేశంలోని మౌలిక సదుపాయాలను నియంత్రిస్తున్నారని రాహుల్ వ్యాఖ్యానించడం ఇందుకు కారణమయ్యింది. వ్యాపారవేత్తల పేర్లను ప్రస్తావించడంపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అధికార, విపక్ష సభ్యుల వాదనలతో సభలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో జోక్యం చేసుకున్న పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్‌రిజిజు.. రాహుల్‌కు సభానియమాలు తెలియవంటూ విమర్శించారు. అందుకు బదులిచ్చిన రాహుల్.. అధికార పక్ష నేతల వ్యవహారశైలికి అనుగుణంగా స్పందిస్తామన్నారు. గుత్తాధిపత్యాన్ని మరింత బలోపేతం చేయడమే బడ్జెట్ ముఖ్య ఉద్దేశమని రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశంలో భయానక వాతావరణం నెలకొందన్నారు. చక్రవ్యూహం ద్వారా ఈ భయం వ్యాపిస్తోందన్న రాహుల్.. భాజపా ఎంపీలతో సహా రైతులు, కార్మికులు, ప్రతి ఒక్కరూ అందులో చిక్కుకుంటున్నారని అన్నారు. అగ్నివీర్‌లను కేంద్రం మోసం చేస్తోందన్న రాహుల్.. వీరి పింఛను కోసం బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించలేదన్నారు. పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతులు ఆందోళన చేసినప్పటికీ.. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించలేదన్నారు.

"వేల సంవత్సరాల క్రితం హరియాణాలోని కురుక్షేత్రలో అభిమన్యుడిని చక్రవ్యూహంలో బంధించి హతమార్చారు. చక్రవ్యూహంలో హింస, భయం ఉంటాయి. అభిమన్యుడు అందులో చిక్కుకొని బలైపోయాడు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న ప్రభుత్వం చక్రవ్యూహాన్ని నిర్మిస్తే.. కుల గణన చేపట్టి దాన్ని విచ్ఛిన్నం చేస్తామని ఉద్ఘాటించారు.

### పదోన్నతి పొందిన ఉపాధ్యాయులతో
## 2న సీఎం సమావేశం.. ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

మొదటి పేజీ తరువాయి...

సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంత పెద్దసంఖ్యలో రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. ఈ పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులందరితో సీఎం నేరుగా మాట్లాడేందుకు ఆగస్టు 2న సమావేశం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎల్బీ స్టేడియంలో దాదాపు రైన్ ప్రూఫ్ టెంట్స్ వేయించాలని సూచించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే ఉపాధ్యాయులకు తగు పార్కింగ్ ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశ ప్రాంగణంలో కావాల్సిన మంచినీరు, పారిశుధ్యం తదితర సౌకర్యాలను కల్పించాలని సూచించారు.

## పొలాలకు మీటర్లు పెట్టాలని చెప్పలేదు

మొదటి పేజీ తరువాయి...

పెరిగింది. 2014లో రాష్ట్రంలో వ్యక్తిగత విద్యుత్ వినియోగం 1,196 కిలో వాట్లు. 2024లోఇది 2,349 కిలో వాట్లకు చేరింది. మా ప్రభుత్వంలోనే విద్యుత్ వినియోగం పెరిగింది. రూ.90 వేల కోట్లు పెట్టి విద్యుత్ సరఫరాను బలోపేతం చేశాం. వినియోగం ఆధారంగానే విభజన సమయంలో రాష్ట్రానికి విద్యుత్‌ను కేటాయించారు. రూ.24 వేల కోట్ల అప్పుతో విద్యుత్ రంగం మా చేతికి వచ్చింది. అప్పులు చేయకుండా అభివృద్ధి ఎలా చేయాలి? అప్పులు చేయకుండా నోట్లు ముద్రించాలా? అప్పులు చేస్తున్నామని అసెంబ్లీలో కేసీఆర్ ఆనాడే చెప్పారు. ఏదో కొత్త విషయం చెప్పినట్లు ఇప్పుడు పదేపదే అప్పులు చేశారు అంటున్నారు' అని జగదీశ్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముమ్మాటికీ సత్యహరిశ్చంద్రుడే అని మాజీ విద్యుత్ శాఖ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తేల్చిచెప్పారు. రేవంత్‌లా సంచులు మోసే చంద్రుడు కాదు అని ఆయన పేర్కొన్నారు. శాసనసభలో విద్యుత్ పద్దులపై చర్చ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. సత్యహరిశ్చంద్రులు అయితే ఎందుకు విద్యుత్ జ్యుడిషియల్ కమిషన్‌కు అడ్డు వస్తున్నారని పేర్కొన్నారు.

### తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్‌లో
## భారీ కుంభకోణం

మొదటి పేజీ తరువాయి...

సోమేష్‌కుమార్‌తోపాటు ఐఐటీ హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, కమర్షియల్ ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ ఎ.శివరామ ప్రసాద్, ప్లియాంటో టెక్నాలజీస్‌పై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమేశ్‌కుమార్‌పై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. పన్ను ఎగవేతదార్లకు వీరు సహకరించడం ద్వారా రూ.వేల కోట్ల అక్రమాలు జరిగినట్లు ఆశాఖ జాయింట్ కమిషనర్ రవి కానూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోద్కెంది. ఒక్క తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ పన్ను ఎగవేత ద్వారానే వాణిజ్యపన్నుల శాఖకు రూ.1,000కోట్లకుపైగా నష్టం వాటిల్లగా.. మరో 11 ప్రైవేటు సంస్థలు సుమారు రూ.400కోట్లు ఎగవేసినట్లు ప్రాథమికంగా వెల్లడ్కెనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌లోని వివరాల మేరకు.. మానవ వనరులను సరఫరా చేసే బిగ్‌లీప్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పన్ను చెల్లించకుండానే రూ.25.51కోట్ల ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ తీసుకుని మోసానికి పాల్పడినట్లు తేలిన నేపథ్యంలో వాణిజ్యపన్నుల శాఖ అంతర్గతంగా విచారణ జరిపింది. వాణిజ్యపన్నులశాఖకు సాంకేతికతను అందించే సర్వీస్ ప్రొవైడర్‌గా ఐఐటీ హైదరాబాద్ వ్యవహరించింది. తెలంగాణలో పన్ను చెల్లింపుదారులు నమోదు చేసే ఐటీ రిటర్న్‌ల్లో అక్రమాలను గుర్తించడంతోపాటు డేటాను విశ్లేషించడం సర్వీస్‌ప్రొవైడర్ చేయాల్సిన పని. పన్నుచెల్లింపు దారుల్లో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే సర్వీస్ ప్రొవైడర్ రూపొందించిన 'స్క్రూటినీ మాడ్యూల్' గుర్తించాల్సి ఉంటుంది. కానీ బిగ్‌లీప్ టెక్నాలజీస్ అక్రమాలకు పాల్పడినా ఈ మాడ్యూల్ గుర్తించలేదు. వాణిజ్య పన్నుల శాఖ అంతర్గత విచారణలో తీగ లాగితే డొంక కదిలింది. బిగ్‌లీప్ అక్రమాల నేపథ్యంలో వాణిజ్యపన్నుల శాఖ నియమించిన ఓ అధికారి గతేడాది డిసెంబరు 26న ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలో విచారణ జరిపారు. అప్పటి రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రెటరీతోపాటు ఎస్.వి.కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్‌ల మౌఖిక ఆదేశాల మేరకు అక్రమాలను గుర్తించకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్లు ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. ఐజీఎస్టీలో అక్రమాలను గుర్తించకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసిన కారణంగా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లినట్లు వివరించారు. అలాగే ఐఐటీ హైదరాబాద్ ప్రాంగణంలోని ప్లియాంటో టెక్నాలజీస్ సంస్థ వాణిజ్య పన్నుల శాఖ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నట్లు నివేదికలో వెల్లడిరచారు. ఈ నివేదిక ఆధారంగా కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్, ప్లియాంటో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను వాణిజ్యపన్నుల శాఖ వివరణ కోరింది. సోమేశ్‌కుమార్ ఆదేశాలతోనే తాము సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయాలని సూచించినట్లు వారిద్దరు వివరణ ఇచ్చారు. వాణిజ్యపన్నుల శాఖకు సంబంధించి తామెలాంటి సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయలేదని ప్లియాంటో టెక్నాలజీస్ సంస్థ వివరణ ఇచ్చింది. ఈనేపథ్యంలో తమ శాఖకు, ఐఐటీ హైదరాబాద్‌కు జరిగిన ఒప్పందం గురించి మరింత లోతుగా వివరాలు రాబట్టేందుకు జనవరి 25న స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ డ్కెరెక్టర్‌కు వాణిజ్యపన్నులశాఖ ఉన్నతాధికారులు లేఖ రాశారు. పలు లోపాలున్నట్లు ఆడిట్ డిపార్ట్‌మెంట్ నివేదిక ఇచ్చింది. డేటా అంతా ఐఐటీ హైదరాబాద్ నియంత్రణలోనే ఉన్నట్లు.. డేటాలో అవసరమైనప్పుడు మార్పులు చేసేందుకు అవకాశముందని వెల్లడిరచింది. మరోవైపు ఐఐటీ హైదరాబాద్ నిర్వహణలో ఉన్న డేటాబేస్, ఆడిట్ అప్లికేషన్ల గురించి సీడాక్ నుంచి సైతం వాణిజ్యపన్నుల శాఖ నివేదిక తెప్పించింది. ఈనేపథ్యంలో సీడాక్, ఐఐటీ హైదరాబాద్, వాణిజ్యపన్నుల శాఖ ఉన్నతాధికారుల మధ్య జనవరి 30న ఒక సమావేశం జరిగింది. 'స్పెషల్ ఇనిషియేటివ్స్' పేరిట ఏర్పాట్కెన వాట్సప్ గ్రూప్ నుంచి ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ ప్రొ.శోభన్‌బాబుకు తరచూ ఆదేశాలు వచ్చేవని ఆ సమావేశంలో వెల్లడ్కెంది. ఆ గ్రూప్‌లో సోమేశ్‌కుమార్, కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్ సభ్యులుగా ఉన్నట్లు తేలింది. వాట్సప్ గ్రూప్ ఏర్పాటు వెనక ఉద్దేశం గురించి వాణిజ్యపన్నుల శాఖ మరోసారి కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్‌ల నుంచి వివరణ కోరింది. సోమేశ్‌కుమార్ పర్యవేక్షణలోనే ఏర్పాట్కెన ఆ గ్రూప్‌ను 2022 డిసెంబరులోనే నిలిపివేశామని వారిద్దరు సమాధానమిచ్చారు. అయితే 2024 ఫిబ్రవరి వరకు ఆ వాట్సప్ గ్రూప్‌లో కార్యకలాపాలు నడిచాయని తేలడంతో ఫొటోలు, వీడియోలతో కూడిన చాట్ హిస్టరీని సమర్పించాలని వాణిజ్యపన్నుల శాఖ ఉన్నతాధికారులు వారిద్దరికి అత్యవసర మెమో జారీ చేశారు. ఐజీఎస్టీ నష్టాలకు సంబంధించిన పలు నివేదికలను వాటిలో గుర్తించారు. అలాగే జీఎస్టీ చెల్లింపుల్లో అక్రమాల కేసుల్లోనూ రిజిస్ట్రేషన్లను రద్దు చేయొద్దనే ఆదేశాలున్నట్లు తేలింది. వారిద్దరి సెల్‌ఫోన్లను ఉన్నతాధికారులు జప్తు చేశారు. వారిద్దరు హైకోర్టును ఆశ్రయించగా వారి పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. మరోవైపు ఫోరెన్సిక్ ఆడిట్ సక్రమంగా జరిగేలా చూసేందుకు ప్రాజెక్టు ఇన్వెస్టిగేటర్‌ను మార్చాలని ఐఐటీ హైదరాబాద్ డ్కెరెక్టర్‌కు వాణిజ్యపన్నుల శాఖ లేఖ రాసింది. అలాగే అప్పటి స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎప్పటికప్పుడు ఇచ్చిన సూచనల మేరకే తాము నడుచుకున్నామని పేర్కొంటూ అందుకు సంబంధించిన కొన్ని ప్రతుల్ని వాణిజ్యపన్నుల శాఖకు ఐఐటీ హైదరాబాద్ పంపించింది. ఎస్‌జీఎస్టీ, సీజీఎస్టీలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటీసుల గురించి మాత్రమే ఆ ప్రతుల్లో ఉన్నట్లు తేలింది. కాశీవిశ్వేశ్వరరావు చెప్పినట్లు ఐజీఎస్టీకి సంబంధించి లేకపోవడం గమనార్హం. ఫోరెన్సిక్ ఆడిట్‌కు సంబంధించి సీడాక్ తుదినివేదిక ప్రకారం.. 75 మంది పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన కార్యకలాపాల్ని ఉద్దేశపూర్వకంగా ఆన్‌లైన్‌లో కనిపించకుండా చేసినట్లు గుర్తించారు. పన్ను ఎగవేతకు సహకరించేందుకే ఇలా చేసినట్లు తేలింది.

## నీళ్ల కోసం రైతుల మధ్య ఘర్షణ - పలువురికి గాయాలు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 29(ప్రభాత ఉదయం)పొలం వద్ద నీళ్ల విషయంలో రైతుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగ అయిదుగురికి గాయాలైనట్లు ధరూర్ పోలీసులు తెలిపారు. స్థానికులు, బాధితుల కథనం మేరకు. కేటిదొడ్డి మండలం పాతపాలెం గ్రామానికి చెందిన సాయప్ప, వెంకట్రాములు బావబామర్దలు. సాయప్పకు, వెంకట్రాములుకు ధరూర్ మండలం నీళహళ్లి గ్రామ శివారులో గల చెరువు కిందా వ్యవసాయభూమి కలదు. చెరువు నుండి వచ్చు కాలువ నీళ్ల ద్వారా సాగు చేస్తారు. ఈ నేషథ్యంలో సోమవారం వెంకట్రాములు తన పొలంలో కాలువ తీసేందుకు వెళ్లగా సాయప్ప కుటుంబ సభ్యులు వారించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటమాట పెరిగి దాడులకు దారి తీసింది. ఈ సంఘటనలో కర్ణ, రాజుకు తీవ్ర గాయాలయ్యాయి, వీరిని కర్నూల్ ఆసుపత్రికి తరలించగా గాయాలైన సాయప్ప, నరేష్,





నాగేంద్ర, నాగరాజు, నవీన్ లు గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతు న్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ధరూర్ ఎస్ఐ అబ్దుల్ షకూర్ తెలిపారు. కాగ పాతపాలెం గ్రామానికి చెందిన ఓ రైతు నీళహళ్లి గ్రామ శివారులో ఉన్న తన వ్యవసాయ భూమిని వెంకట్రాములు, సాయప్పకు విక్రయించారు. వెంట్రాములు కొనగోలు చేసిన వ్యవసాయ పొలంలో ఉన్న బోరు ద్వారా వంతులవారిగా ఇద్దరు వ్యవసాయపొలానికి సాగునీరు వినియోగించుకునే వాళ్లు. కొన్నేళ్లుగా ఇద్దరి మధ్య బోరు నీళ్ల కోసం గొడవలు జరిగినట్లు ఈ నేపథ్యంలో సోమవారం ఇద్దరు కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణకు దారితీసినట్లు ధరూర్ పోలీసులు తెలిపారు.


## గగన్ పహాడ్‌లో జరిగిన తొట్టెల ఊరేగింపు, ఫలహారపు బండి ఊరేగింపులో పాల్గొన్న

# కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్, జూలై29(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని గగన్ పహాడ్, బాబుల్ రెడ్డి నగర్ బస్తీలలో బోనాల ఉత్సవాలు, తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజక వర్గం మైలార్ దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించడం జరిగింది. అమ్మవారి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. కార్పొరేటర్ తోకల మాట్లాడుతూ, ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు, దీవెనలతో ప్రజలందరూ జీవితాంతం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని కార్పొరేటర్ ఆకాంక్షించారు. రాష్ట్రంలో సుభిక్షంగా వర్షాలు కురిసి ప్రజలందరూ పాడిపంటలతో సుభిక్షంగా, ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కార్పొరేటర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తలారి చిన్న, శివ కుమార్, రమేష్ రెడ్డి, సెంట్రింగ్ శ్రీను, శేఖర్, శంకర్ సోమ శ్రీను, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొనడం జరిగింది.


తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి..


పోతురాజులతో తోకల శ్రీనివాస్ రెడ్డి


సయ్యద్ ముజమ్మిల్ అహ్మద్ కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్

## కాంగ్రెస్‌లో చేరిన

# బీఆర్ఎస్ నాయకులు

బుద్వేల్, జూలై29(ప్రభాత ఉదయం): బీఆర్ఎస్ రాజేంద్రనగర్ డివిజన్ ఉపాధ్యక్షుడు సయ్యద్ ముజమ్మిల్ అహ్మద్ సోమవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముజమ్మిల్ అహ్మద్ వెంట బీఆర్ఎస్ నాయకులు ముజీబ్, సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ తఫజుల్, జాఫర్, ఆర్షద్, పాషా, షానవాజ్, కబీర్ ఖాన్, మహ్మద్ యూసుఫ్ , షోయబ్, అబు బాకర్, అబ్దుల్లా, అద్నాన్, అక్తర్, ఖాలేద్ లు ఉన్నారు.

# గుంతలు పడ్డ రోడ్లను బాగు చేయరా?

బుద్వేల్, జూలై 29 (ప్రభాత ఉదయం): బోనాల పండుగ వస్తుంది కనీసం ప్రధాన రహదారుల్లో గుంతలు ఉన్న ప్రాంతంలో మొరం.మట్టి, డస్ట్ వేయాలని ముందుగా చెప్పినప్పటికీ రాజేంద్రనగర్ మెయిన్ రోడ్ అంబేద్కర్ చౌరస్తా ఎన్ ఐ ఆర్ డీ ఆర్చ్ వద్ద ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఇది. ఆదివారం బోనాలు ఎత్తుకొని వచ్చిన మహిళల పరిస్థితి ఒక్క సారి అధికారులు ఆలోచించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ వై. శ్రీధర్ అన్నారు. 15 రోజుల ముందు నుండి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక కార్పొరేటర్లు, అధికారులతో కలసి సమావేశమై బోనాలు వెళ్ళే దారిలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదని ఒకటి రెండు సార్లు పర్యటించి పనులు చేశారు. అయితే అవి నామ్ కె వాస్తేగా జరిగాయి. ఎటువంటి మోసం, అవకతవకలు జరగొద్దని గిరిజన సమాజానికి కాంట్రాక్టు పనులు అప్పగించినా, తిరిగి ఒక ముస్లిం కాంట్రాక్టర్ చేతిలో పని పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు . సార్ మా ప్రాంతం రండి వచ్చి చూడండి అని దేవాలయ కమిటీ నాయకులు అడిగితే ఆ ముస్లిం కాంట్రాక్టర్ సెల్ నెంబర్ ఇస్తున్నారు అన్నారు. అతను మాత్రం ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని వాపోయారు. లిఫ్ట్ చేసినా, నాకు సంబంధం లేదు... ఇంజనీరింగ్ సెక్షన్ వారికి ఫోన్ చేయండి అంటున్నారని అన్నారు. నేను డస్ట్ తెచ్చి రాజేంద్రనగర్ సర్కిల్ ఆఫీస్ లో వేసిన , అక్కడినుండి వాళ్ళే మీకు వేస్తారు ఇది అతని సమాధానం అన్నారు. ఏదైతే ఏంటి మొత్తం మీద బోనాల పండుగ అయిపోయింది.... స్ట్రీట్ లైట్స్ రిపేరింగ్ లేదు ...బస్తీ మొత్తం అంధకారం గా ఉందన్నారు. అధికారులు కళ్ళు తెరవాలని.. లేనట్లయితే రాజేంద్రనగర్ సర్కిల్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమం చేపడుతాం అని శ్రీధర్ హెచ్చరించారు.


గుంతల మయంగా రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలోని రోడ్డు


వై. శ్రీధర్


నందనవనం అపార్ట్ మెంట్ సమీపంలో గల భూ లక్ష్మమ్మ అమ్మ వారికి బోనం సమర్పించిన వనం నర్సింహ కుటుంబ సభ్యులు

## హైదర్‌గూడలో భూలక్ష్మమ్మ దేవాలయంలో బోనం సమర్పించిన


# వనం నరసింహ మాదిగ కుటుంబ సభ్యులు

బుద్వేల్, జూలై29(ప్రభాత ఉదయం): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు వనం నరసింహ మాదిగ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం హైదర్ గూడ లోని తమ నివాసం ముందు ఉన్న ఇంటి దైవం భూ లక్ష్మమ్మ దేవాలయంలో బోనం సమర్పించారు. అంతేకాకుండా హైదర్ గూడ లోని మరో మూడు చోట్ల అమ్మవారి దేవాలయాల లో కుటుంబ సభ్యులతో కలిసి భోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

# జూరాలపై కొరవడిన భద్రత

## పోటోల కోసం పాత్ వే పైన పర్యాటకులు

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 29(ప్రభాత ఉదయం)జూరాల ప్రాజెక్టు వద్ద అధికారుల పర్యవేక్షణ కరువైంది. కర్ణాటక జలాశయాల నుంచి జూరాలకు వరద ప్రవాహం పెరగడంతో జూరాల గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సెలవు రోజు కావడంతో జూరాల వద్ద ప్రకృతి అందాలను తిలకించేందుకు సందర్శకులు పోటెత్తారు. నిబంధనల ప్రకారం డ్యామ్ పాత్ వే పైన వెళ్లడానికి ఎవరికి అనుమతులు లేవు. అందుకు విరుద్దంగా సందర్శకులు డ్యాం పై బాగాన ఉన్న క్రష్ గేట్లు తెరిచే ప్రాంతానికి వెళ్లి వరద ప్రవాహాన్ని తిలకిస్తు పోటోలు దిగుతు ఎంజాయ్ చేస్తున్నారు. అదే విధంగా క్రష్ట్ గేట్ల ముందు ఉన్న పాత్ వే ర్యాంపు పై సందర్శకులు నడుచుకుంటూ వెళ్లి వరద ప్రవాహాన్ని తిలకిస్తూ పోటోల కోసం ఎగబడుతున్నారు. వరద ప్రవాహం ఉధృత్తంగా ఉన్న నేపథ్యంలో ప్రమాదవశాత్తు సందర్శకులు నదిలో పడితే ఎవరు బాధ్యత వహిస్తారని పర్యాటకులు విమర్శిస్తున్నారు. పారే నీళ్ల వద్ద పోటోలు దిగువద్దని అధికారుల హెచ్చరికలు ఎక్కడ కనిపించకోవడంతో పర్యాటకుల ఇష్టారాజ్యంగా మారింది. అదే విధంగా ప్రాజెక్టును చూడటానికి వచ్చిన పర్యాటకులు తమ వాహనాలను ప్రాజెక్టు మీద నిలిపివేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలలో పోలీసులను నియమించి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చూడాలని వాహనదారులు కోరారు.




స్పీకర్ ప్రసాద్ కుమార్ కు పుష్పగుచ్చం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## రాష్ట్ర శాసన సభ స్పీకర్

# గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే

రాజేంద్రనగర్,జులై 29(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఆయన నివాసంతో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ కుమార్ కు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి,అభినందనలు తెలియజేశారు. అనంతరం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని వివిధ అంశాలపై స్పీకర్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు.రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు,నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు.అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు తమ వంతు కృషి చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కోరారు. సానుకూలంగా స్పందించిన స్పీకర్ అభివృద్ధి పనులకు అన్ని విధాలుగా తమ వంతు సహకరిస్తానని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ...అధిష్టాన ఆదేశానుసారం ప్రజాసేవకు అంకితమై, నిస్వార్ధంగా ప్రజల ఆర్థిక అభివృద్ధి కోసం పాటుపడతానని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.


అమ్మవారి చీరను వేలంపాటలో దక్కించుకున్న ఎస్ఐ వినోద్ దంపతులను సన్మానిస్తున్న భవాని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

## భవాని కాలనీలో

# ఘనంగా బోనాల ఉత్సవాలు

బండ్లగూడ, జూలై29(ప్రభాత ఉదయం): బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భవాని కాలనీ లో ఆషాడ మాస బోనాల ఉత్సవాలు కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల శ్రీలత ప్రేమ్ గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి,స్థానిక కార్పొరేటర్ భూపాల్ గౌడ్ ల పర్యవేక్షణలో బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కనుల పండుగగా నిర్వహించారు. భవాని కాలనీలోని భవాని మాత ఆలయానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు తరలివచ్చి కాలనీ మహిళలు అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీలోని మహిళలు డప్పు చప్పుళ్ళ మధ్య అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం వేళల్లో నిర్వాహకులు తొట్టే ల ఊరేగింపు , అమ్మ వారి చీర వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో భవాని కాలనీ నివాసులు ఎస్సై వినోద్ దంపతులు అమ్మవారి చీర దక్కించుకున్నారు. సందర్భంగా ఎస్సై వినోదంపతులను కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా సన్మానించారు.

## లిఫ్ట్ పైన పడటంతో

# ఓ మహిళా కార్మికురాలు మృతి

## శివరాంపల్లి హెన్రి మార్టిన్ ఇనిస్టిట్యూట్ లో సంఘటన

బుద్వేల్, జూలై29(ప్రభాత ఉదయం) : లిఫ్ట్ మీద పడడంతో ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందారు . ఈ సంఘటన ఆదివారం సాయంత్రం శివరాంపల్లిలోని హెన్రి మార్టిన్ ఇనిస్టిట్యూట్ లో జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి . శివరాంపల్లిలోని హెన్రి మార్టిన్ ఇనిస్టిట్యూట్ అనే క్రైస్తవ ఆధ్యాత్మిక శిక్షణాలయం ఉంది. అందులో వికారాబాద్ కు చెందిన పద్మమ్మ (35 ) గత 12 సంవత్సరాలుగా పనులు చేస్తూ శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 294 వద్ద నివాసం ఉంటుంది . ఆదివారం హెన్రి మార్టిన్ సంస్థ లో పని చేస్తూ లిఫ్ట్ ఎక్కాలని గ్రౌండ్ ఫ్లోర్ లో ఉండి లిఫ్ట్ బటన్ నొక్కింది. లిఫ్ట్ కిందకు రాలేదు కానీ ఆమె లిఫ్ట్ లోకి కాలు పెట్టగా కింద పడిపోయింది. వెంటనే ఆమె పైకి ఎక్కడానికి ప్రయత్నిస్తుండగా, అప్పటికే లిఫ్ట్ నొక్కి ఉన్నందున పైనుంచి వచ్చిన లిఫ్ట్ పద్మమ్మ పై పడి అక్కడక్కడ మృతి చెందింది. ఆమె భర్త ఆంజనేయులు అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు . ఇన్ స్పెక్టర్ వెంకటరామిరెడ్డి పర్యవేక్షణలో ఎస్సై వెంకన్న దర్యాప్తు చేస్తున్నారు.

# రాష్ట్రంలో ముదిరాజ్ అభివృద్ధి సంక్షేమానికి అధిక నిధులు రాబడతా

## రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సోసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

## రాష్ట్ర ముదిరాజ్ ఐకృత సమావేశంలో పాల్గొన్న మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు నీలం మధు

మొయినాబాద్ జూలై 29 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ కులాల వారు ఐక్యమత్యంగా కలిసి అభివృద్ధి చేసుకుందామని ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అధిక నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సోసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్నగర్లోని పి.వి. కనెక్షన్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ ఐక్యత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సోసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వరముదిరాజ్తో పాటు మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరిముదిరాజ్, మెదక్ కంటెస్టెడ్ ఎంపి నీలం మధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మొదటిసారిగా కులానికి సేవ చేసే భాగ్యం అందించారన్నారు. ఈ అదృష్టం తనకు వరించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ఈ చైర్మన్ పదవిని కుల. సంఘాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. జాతి కోసం కలిసి పని చేయాలని ఆయన పేర్కొన్నారు. జాతికి పని చేస్తేనే రుణం తీర్చుకున్న వారము అవుతామని సూచించారు. ముఖ్యంగా ముదిరాజ్ సభ్యులలో ఉన్న కుటుంబ సభ్యులందరు తమ పిల్లలను ఉన్నత చదువుల వరకు తీసుకువెళ్లడం లేదని ఇందుకు వెనుకబడిపోతున్నామన్నారు. ఏదిఏమైనా తల్లిదండ్రులు ఎంత కష్టం చదివించాలని పిల్లలను ఉన్నత స్థాయికి ఐఏఎస్, ఐపిఎస్, డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లుగా చేసినప్పుడే ముదిరాజ్ జాతిలో గౌరవాన్ని నింపుకోగలుగుతామన్నారు. ప్రభుత్వం ద్వారా పెద్ద ఎత్తున నిధులు రాబట్టడానికి చైర్మన్ గా కృషి చేస్తానని పేర్కొన్నారు. అదే విధంగా ముదిరాజ్ సంఘానికి నార్సింగి ప్రాంతంలో ఐదు ఏకరాలు అప్పట్లో ప్రభుత్వం ద్వారా ఐదు ఏకరాలు ఇవ్వడం జరిగిందని ఆ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు త్వరలో కృషి చేస్తామన్నారు. అందరం ఐక్యమత్యంగా కలిసి అభివృద్ధి చేసుకుందామన్నారు. 60 ఏళ్ల నుంచి జరగని ముదిరాజ్ సంఘాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరిముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు నీలం మధులు మాట్లాడుతూ... రాష్ట్రంలో ముదిరాజ్ జనాభా 50 లక్షల మంది ఉన్నారని అన్నారు. ముదిరాజ్ కులాలను బీసి డి గ్రూప్ నుంచి ఏ గ్రూప్కు మార్చేందుకు ప్రభుత్వం ద్వారా సాధించుకునేందుకు ఐక్యమత్యంగా పోరాడుదామన్నారు. మెదక్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ డిక్లరేషన్లో ముదిరాజ్ సభ్యుల సమస్యలు పరిష్కరించడంలో బీసీ డి గ్రూప్ నుంచి ఏ గ్రూప్క మార్చేందుకు అప్పట్లో వాగ్దానం ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం కేవలం వాడుకుందని ఈ ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో మెదక్, మహబూబ్నగర్ జిల్లాల్లో అత్మతధికంగా ముదిరాజ్ కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ద్వారా ముదిరాజ్ కోఆపరేటివ్ సోసైటీకి 50 కోట్ల నిధులు ముఖ్యమంత్రి కేటాయించారన్నారు. కానీ అవి సరిపోవదని కనీసం వెయ్యి కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరనున్నట్లు తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 15 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకునేందుకు అందరం కృషి చేద్దామని తెలిపారు. ఐకృతతోనే దేనినైనా సాధించగలమని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ముదిరాజ్ ఐకృత సమావేశం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సురేష్ ముదిరాజ్, వైద్య నిపుణులు డాక్టర్ ప్రతిభ లక్ష్మి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జగన్మోహన్ ముదిరాజ్, షాద్నగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి అందెబాబాయ్య, జిల్లా అధ్యక్షులు గుడాల మల్లేష్, జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ నారాయణపురం మహేందర ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ ముదిరాజ్, మత్స్య సహకార సంఘం జిల్లా నాయకులు మంచిరేవుల శ్రీరాములు, గరుగు రాజు ముదిరాజ్,, మహేందర ముదిరాజ్, జొన్నాడ యాదయ్య ముదిరాజ్, సుల్తాన్పల్లి సిద్దేశ్వర్, మెరుగు సురేష్, బాలాజీ టెంపుల్ రాంచందర్, రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుంచి ముదిరాజ్ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్

# స్పిరిట్‌లో ఊహించని సర్‌ప్రైజ్

దర్శకుడు సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో ప్రభాస్ హీరోగా స్పిరిట్ మూవీపై క్రేజ్ ఓ రేంజ్ ఉంది. పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్.. వరుసగా రెండు హిట్‌ల తర్వాత ఈ చిత్రం వస్తుండడంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా చేసిన ఈ చిత్రం ఇప్పటికే రూ. 1,100 కోట్ల కలెక్షన్లు దాటేసింది. ఇంకా జోరు కనబరుస్తోంది. ప్రభాస్ ప్రస్తుతం రాజాసాబ్ సినిమా చేస్తున్నారు. ఆ తర్వాత సెన్సేషనల్ డైరెక్టర్ సందీర్ రెడ్డి వంగాతో స్పిరిట్ మూవీ చేయనున్నారు. మోస్ట్ వైలెంట్ మూవీ యానిమల్‌తో సందీప్ రెడ్డి వంగా గతేడాది బ్లాక్‌బస్టర్ కొట్టారు. తీవ్రమైన విమర్శలు వచ్చినా ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద సక్సెస్ అయింది. ప్రభాస్‌తో సందీప్ చేయబోయే సినిమా ఉంటుందా అనే ఆసక్తి అందరిలో విపరీతంగా ఉంది. ఈ మూవీలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ నటిస్తారని సందీప్ ఇటీవలే చెప్పారు. అయితే, స్పిరిట్ చిత్రం గురించి ఓ క్రేజీ రూమర్ బయటికి వచ్చింది. డైరెక్టర్ సందీప్ వంగ తన హీరోలను అంతకు మించి అనేలా చూపిస్తుంటాడు. స్పిరిట్ సినిమాలో ఇప్పటివరకు చూడని ప్రభాస్‌ను చూపించబోతున్నట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా కటౌట్ ప్రభాస్‌ను ఇంకే రేంజ్‌లో ప్రజెంట్ చేస్తాడనే ఆసక్తి అందరిలోను ఉంది. స్పిరిట్ సినిమాలో ప్రభాస్ ద్యుయల్ రోల్ చేస్తారనే రూమర్ తాజాగా బయటికి వచ్చింది. ఈ చిత్రంలో ప్రభాస్ కోసం ఆయన రెండు పాత్రలను రాశారట. ప్రభాస్ చేయనున్న ఓ క్యారెక్టర్ నెగెటివ్‌గా ఉండనుందని తెలుస్తోంది. మరో పాత్ర పాజిటివ్‌గా ఉండనుందని సమాచారం. అయితే, సందీప్ ఇప్పటికే చెప్పిన పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్ ఈ రెండింట్లో ఎలా ఉ ంటుందనేది ఆసక్తికరంగా మారింది. అంతేకాదు.. ఇంటర్వెల్ బ్యాంగ్‌లో ప్రభాస్ రెండో పాత్ర రివీల్ అవుతుందని.. సినిమా మొత్తానికే ఈ సీక్వెన్స్ మెయిన్ హైలైట్‌గా నిలిచేలా డిజైన్ చేస్తున్నాడట సందీప్. ఇందులో ఎంతవరకు నిజముందో తెలియదు కానీ, ప్రభాస్ డ్యూయెల్ రోల్ అనే న్యూస్ మాత్రం ఆసక్తికరంగా మారింది. అసలు.. సందీప్ సినిమాలో ఒక్క హీరోని తట్టుకోవడమే కష్టం అంటే, అందులో డ్యూయెల్ రోల్, పైగా పాజిటివ్ నెగెటివ్ అంటున్నారంటే, బాక్సాఫీస్ దగ్గర స్పిరిట్‌ను తట్టుకోవడం కష్టమే. ఇక ఈ ఏడాది డిసెంబర్‌లో స్పిరిట్ షూటింగ్ మొదలవుతుందని గతంలోనే సందీప్ రెడ్డి వంగా హింట్ ఇచ్చాడు. ఇప్పటికే స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరుకున్నట్టు తెలుస్తోంది. ప్రభాస్ ప్రస్తుతం రాజాసాబ్ సినిమా చేస్తున్నాడు. ఆ తర్వాత సలార్ 2, కల్కి 2 హను రాఘవపూడి ప్రాజెక్ట్స్ లైన్లో ఉన్నాయి. కాబట్టి.. స్పిరిట్ మరింత వెనక్కి వెళ్లే ఛాన్స్ ఉంది. మరి ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుందట. సందీప్ రెడ్డి వంగా ప్రస్తుతం స్పిరిట్ స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు.





## బాత్రూమ్ వీడియో లీక్‌పై స్పందించిన ఊర్వశి రౌతెలా

### అంటే.. ఇందులో ఆమె ప్రమేయం లేదా?

టెక్నాలజీ అనేది పెరుగుతున్నకొద్దీ సినీ సెలబ్రిటీలకు దీని వల్ల కలుగుతున్న ఇబ్బందులు కూడా పెరిగిపోతున్నాయి. ఎప్పుడూ అందరి ఫోకస్లో ఉండే వారికి.. ప్రైవసీ అనేది లేకుండా పోతోంది. తాజాగా ఊర్వశి రౌతెలా కూడా ఈ టెక్నాలజీకి బలయ్యింది. ఇటీవల తన బాత్రూమ్ వీడియో లీక్ అయ్యింది. కొన్ని గంటల్లోనే అది సోషల్ మీడియా అంతటా వైరల్ అయ్యింది. దీంతో నెటిజన్లు.. దీని గురించే మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. కొందరు ఇది కావాలని లీక్ చేసిన వీడియో అని కూడా అన్నారు. ఇక నెటిజన్ల కామెంట్స్కు ఊర్వశి రౌతెలా తాజాగా స్పందించింది.

**ఆ వీడియో కాదు..**

ఈ రోజుల్లో పబ్లిసిటీ కోసం, సినిమా ప్రమోషన్స్ కోసం నటీనటులు ఏదేదో చేస్తున్నారు. ఇక ఊర్వశి రౌతెలా బాత్రూమ్ వీడియో కూడా అలాంటి ఒక పబ్లిసిటీ స్టంట్ అని చాలామంది నెటిజన్లు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై ఊర్వశి స్పందించకపోవడం కూడా అనేక అనుమానాలకు దారితీసింది. కావాలేనే ఆ వీడియో లీక్ చేసి ఉంటారని సందేహించారు. ఇక ఫైనల్గా సైలెన్స్ను బ్రేక్ చేస్తూ ఈ విషయంపై రియాక్ట్ అయ్యింది ఈ భామ. "ఈ వీడియో బయటికి వచ్చినప్పటి నుండి నేను చాలా బాధలో ఉన్నాను. ఇది నా 'ఘుస్పైటియా' సినిమాలోని సీన్. నా నిజ జీవితంలో జరిగింది కాదు. అది నిజంగా స్నానం చేస్తున్నప్పుడు తీసిన వీడియో కాదు" అని క్లారిటీ ఇచ్చింది ఊర్వశి రౌతెలా.

## ఆ విషయంలో నేను హ్యాపీ

### అందరికీ ఇలాంటి ఛాన్స్ రాదు: అవికా గోర్

బాలీవుడ్ ప్రముఖులు మహేశ్ భట్, విక్రమ్ భట్‌లతో కలిసి రెండు సినిమాలు చేయడంపై నటి అవికా గోర్ ఆనందం వ్యక్తం చేసింది. అలాంటి అవకాశం అందరికీ రాదని పేర్కొంది. ఈ ముగ్గురి కాంబినేషన్‌లో వచ్చిన తాజా చిత్రం 'బ్లడీ ఇష్క్'. ఇటీవల నేరుగా ఓటీటీ 'డిస్నీ హాట్‌స్టార్' లో విడుదలైంది. ప్రచారంలో భాగంగా టీమ్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఈ క్రమంలోనే ఆ దర్శక, రచయితల గురించి అవికా ప్రత్యేకంగా మాట్లాడింది. "మహేశ్, విక్రమ్ సర్‌లతో కలిసి వర్క్ చేయడం నా అదృష్టం. సెట్స్‌లో వారి నుంచి ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నా. వారిద్దరూ నాకు స్ఫూర్తి. 'బ్లడీ ఇష్క్' స్టోరీనే నన్ను ఎంపిక చేసుకుందనుకుంటున్నా. ఫలానా దర్శకుడి సినిమాలో నటించాలని చాలామంది కలలు కంటుంటారు. అలాంటి వారిలో నేనూ ఉన్నా. కానీ, విక్రమ్ భట్ డైరెక్షన్‌లో రెండు చిత్రాల్లో నటిస్తానని, వాటికి మహేశ్ భట్ కథ అందిస్తారని ఎప్పుడూ అనుకోలేదు" అని పేర్కొంది. ఇంతకుముందు ఇదే కాంబోలో '1920: హారర్స్ ఆఫ్ ది హార్ట్' తెరకెక్కింది. ఈ రెండు హారర్ స్టోరీలను సుహ్రితా దాస్‌తో కలిసి మహేశ్ భట్ రాశారు. తెలుగులో ప్రస్తుతం 'షణ్ముఖ'లో నటిస్తోంది అవికా. ఆది సాయికుమార్ హీరోగా రూపొందుతున్న చిత్రమిది. అక్టోబరులో విడుదల కానుంది.



## ఆ విషయంలో సిగ్గెందుకు

### తేల్చి చెప్పిన హాసన్ బ్యూటీ

ఇండస్ట్రీకి ఎలా వచ్చాం అన్నది కాదు.. ఎలా నిలబడ్డాం అన్నది ముఖ్యం. ఎంత స్టార్ హీరో కొడుకు అయినా, కూతురు అయినా కేవలం ఎంట్రీ మాత్రమే ఈజీగా ఉంటుంది. నిలదొక్కుకోవడం అనేది వారి చేతుల్లోనే ఉంటుంది. లోక నాయకుడు కమల్ హాసన్ నటవారసురాలిగా శృతి హాసన్ ఇండస్ట్రీకి పరిచయమైంది. కెరీర్ ప్రారంభంలో శృతి ఏ సినిమా చేసినా అట్టర్ ప్లాప్. దీంతో ఆమెను ఐరెన్ లెగ్ అని ముద్రవేశారు. విజయం దరిచేరాలంటే ఓపిక అవసరం. శృతి కూడా అలాగే విజయాపజయాలను పక్కన పెట్టి.. తన నటన మీద ఫోకస్ చేసింది. గబ్బర్ సింగ్ సినిమాతో అమ్మడి ఫేట్ మొత్తం మారిపోయింది. ఐరెన్ లెగ్ అన్నవారే.. శృతిది గోల్డెన్ లెగ్ అని వరుస అవకాశాలను ఇచ్చారు. అలా శృతి స్టార్ హీరోల సరసన నటించి మెప్పించింది. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంది. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నా శృతి తాజగా ఒక ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదుర్కున్న కొన్ని ఘటనల గురించి చెప్పుకొచ్చింది.హీరోయిన్ గా కమర్షియల్ సినిమాలు చేయడం తన కెరీర్ కు ప్లస్ గా మారిందని, ఆ విషయం చెప్పడంలో సిగ్గు పడేది లేదని చెప్పుకొచ్చింది. " నా కెరీర్ మొదట్లో నేను చాలా ఇబ్బందులు పడ్డాను. నన్ను ఎంతోమంది విమర్శించారు. విమర్శలు చాలా బాధను ఇస్తాయి. కొన్నిసార్లు ఇవే విమర్శలు కొత్తగా వచ్చే తారల కలలను ఆపేయగలవు. నేను వాటి నుంచి ఎంతో నేర్చుకున్నాను. నేను కమర్షియల్ సినిమాల్లో నటించడానికి ఏ మాత్రం సంకోచించను. ఒకానొక సమయంలో అవే నాకు మంచి గుర్తింపును తీసుకొచ్చాయి. ఆ విషయం చెప్పడంలో సిగ్గెందుకు" అని తెలిపింది. అంతే కాకుండా.. ఇండస్ట్రీలో నేపోటిజం ఎక్కువ అని తాను ఒప్పుకున్నట్లు తెలిపిన శృతి.. తన కెరీర్ కు తన తల్లిదండ్రులు ఎలాంటి సహాయం చేయలేదని తెలిపింది. ఎన్నోసార్లు కమల్.. తనకు మార్గ నిర్దేశం చేయాలనీ కోరినా.. తానే స్వయంగా ఎదగాలని దృఢ నిశ్చయం చేసుకొని ఇంతవరకు వచ్చినట్లు తెలిపింది. ప్రస్తుతం శృతి వ్యాఖ్యలు నెట్టింట వైరల్ గా మారాయి.



## ఓదెల-2 నుండి ఇంట్రెస్టింగ్ పోస్టర్ రిలీజ్

తమన్నా భాటియా ప్రధాన పాత్రలో మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న భారీ బడ్జెట్ బహుభాషా చిత్రం ఒదెల 2. తమన్నా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్ ఒదెలా-2. 2021లో వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం ఒడెలా రైల్వే స్టేషన్‌కి కొనసాగింపుగా రానుంది ఈ ఒదెల 2. అశోక్ తేజ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఇటీవల విడుదలన ఈ చిత్ర ఫస్ట్ లుక్, టీజర్ మరియు బి హైండ్ సీన్స్ వీడియో అటు తమన్నా అభిమానుల్లో ఇటు సినీ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ప్రస్తుతం ఈ చిత్రం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలోని ఓదెల మల్లన్న టెంపుల్ సెట్‌లో క్లైమాక్స్ షూటింగ్‌తో జరుగుతోంది. ఈ చిత్రంలో వచ్చే అత్యంత కీలకమైన ఆలయ సన్నివేశాలను తెరకెక్కించేందుకు అధిక బడ్జెట్‌తో రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ సెట్స్ నిర్మించారు. దాదాపు 800 మంది జూనియర్ ఆర్టిస్టులతో పాటు తమన్నా మరియు ఇతర నటీనటులు ప్రసుతం ఈ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. కాగా హైదరాబాద్ బోనాలు ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. చీర కట్టుకుని, తమన్నా భాటియా తలపై బోనం తీసుకు వెళుతున్న పోస్టర్ చూడ చక్కగా ఉంది. యాదృచ్ఛికంగా బోనాల సంబరాలు జరుగుతున్నప్పుడు బోనాల ఎపిసోడ్‌ను షూట్ చేస్తున్నారు ఓదెల యూనిట్. బలమైన కథా,కథనంతో భారీ యాక్షన్‌ను మిళితం చేయడంలో పేరుగాంచిన దర్శకుడు సంపత్ నంది. అతని పర్యవేక్షణలో నిర్మిచబడుతున్న ఒడెలా-2 సినీ ప్రేక్షకులను అలరిస్తుందని టీమ్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. గతంలో సంపత్ నంది దర్శకత్వంలో తమన్నా సిటిమార్, రచ్చ సినిమాలలో నటించిన సంగతి తెలిసిందే.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.